క్లుప్తంగా

అగ్నిమాపక కేంద్రానికి శంకుస్థాపన

పార్వతీపురం రూరల్: జిల్లా కేంద్రంలో ఉన్న అగ్నిమాపక కేంద్రం శిథిలావస్థకు చేరి అధ్వానంగా ఉండడంతో ఇటీవల ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పాత భవనాన్ని తొలగించి అదే ప్రాంతంలో రూ.2కోట్లు నిధులతో కొత్త భవనం నిర్మాణం చేపట్టనున్నారు. కొత్త భవనం నిర్మాణానికి జిల్లా అగ్నిమాపక శాఖాధికారి పి.సింహాచలం సోమవారం శంకుస్థాపన నిర్వహించారు. జిల్లా కేంద్రానికి సరిపడా సామర్థ్యంతో భవనాన్ని నిర్మిస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ హౌసింగ్ జేఈ రాజుబాబు, కేంద్ర అధికారి జి.ప్రభాకర రావు, జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు రమేష్ తదితర సిబ్బంది పాల్గొన్నారు.

ట్రైసైకిల్, ల్యాప్‌టాప్‌లు పంపిణీ చేసిన కలెక్టర్



రాజాన గీతకు ల్యాప్‌టాప్‌ను అందజేస్తున్న కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం రూరల్: దివ్యాంగుడికి ట్రైసైకి, మరో ఇద్దరికి ల్యాప్‌టాప్‌లను కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ పంపిణీ చేశారు. సోమవారం పీజీఆర్ఎస్ కార్యక్రమంలో పార్వతీపురంలోని నిర్మల కాలనీకి చెందిన చింతాడ గుంపయ్య అనే దివ్యాంగుడు ట్రైసైకిల్ మంజూరు చేయాలని అర్జీ ఇవ్వగా తక్షణమే సంబంధిత అధికారులతో కలిసి అందజేశారు. అలాగే సాలూరు నుంచి రాజాన గీత, కొమరాడ నుంచి దత్తి విష్ణువర్ధన్‌నాయుడు, తమకు ల్యాప్‌టాప్‌లు మంజూరు చేయాలని కోరగా కలెక్టర్ తక్షణమే స్పందించి వారికి ల్యాప్‌టాప్‌లను అందజేశారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శోభిక, సబ్‌కలెక్టర్ ఆర్.వైశాలి. డీఆర్‌ఓ కె. హేమలత ఎస్‌డీసీ పి.ధర్మ చంద్రారెడ్డి, డీఆర్‌డీఏ పీడీ ఎన్ సుధారాణి, వికలాంగ సంక్షేమశాఖ అధికార ప్రతినిధి రమణ తదితరులు పాల్గొన్నారు.

25 మందిపై బైండోవర్



ఉత్సవాల నిర్వహణపై అవగాహన కల్పిస్తున్న సీఐ అప్పలనాయుడు

సాలూరు: వినాయక ఉత్సవాల నేపథ్యంలో 25మందిని బైండోవర్ చేసినట్లు సీఐ అప్పలనాయుడు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన మాట్లాడుతూ గణేష ఉత్సవాల నేపథ్యంలో గత పరిస్థితుల దృష్ట్యా 25 మందిని తహసీల్దార్ వద్ద హాజరుపరిచినట్లు చెప్పారు. ఉత్సవాన్ని ప్రశాంతంగా జరపాలని తహసీల్దార్ సూచించారని, 25 మంది వ్యక్తులను బైండోవర్ చేసినట్లు తెలిపారు. గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు పండగను ప్రశాంతంగా జరపాలని సీఐ అప్పలనాయుడు అన్నారు. ఈ మేరకు పట్టణంలో వార్డుల్లో విస్తృతంగా అవగాహన పెంపొందించారు.ఆటో, మైక్ ద్వారా విస్తృతంగా ప్రచారం కల్పిస్తూ అందరూ నియమనిబంధనలు పాటించాలని కోరారు.

బెంచీలు విరగ్గొట్టిన ఆకతాయిలు



విరిగిపోయిన బల్లలు

వీరఘట్టం: స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్ గ్రౌండ్‌లో 1999 బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఏడాది కిందట ఏర్పాటు చేసిన బెంచీలను కొంతమంది ఆకతాయిలు విరగ్గొట్టారు. 8 బెంచీలు ఏర్పాటు చేయగా అందులో రెండింటిని విరగ్గొట్టారని హెచ్‌ఎం బి. సాంబర సోమవారం స్థానిక విలేకరులకు తెలియజేశారు. అందరికీ ఉపయోగపడే బెంచీలను నాశనం చేయడంపై పలువురు అసంతృప్తి వ్యక్తం చేశారు.

ఐకమత్యంతో మెలగాలి



నడిమికెల్ల గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ చంద్రమౌళి, ఎస్సై కళాధర్

వీరఘట్టం: మండలంలోని నడిమికెల్ల గ్రామంలో గతేడాది వినాయక చవితి ఉత్సవాల్లో జరిగిన గొడవలను దృష్టిలో ఉంచుకుని సోమవారం అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ ఎం.చంద్రమౌళి, ఎస్సై జి.కళాధర్ మాట్లాడుతూ.. మనస్పర్ధలను పక్కనబెట్టి ఐకమత్యంతో వినాయక చవితి జరుపుకోవాలని సూచించారు. అలాకాకుండా ఎవ్వరైనా శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం



బలిజిపేటలో కార్యాలయాలకు వెళ్లే రహదారి పక్కనే పేరుకుపోయిన చెత్తాచెదారం

- దోమల వ్యాప్తితో వ్యాధులు వచ్చే ఆస్కారం
- పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

బలిజిపేట: వర్షాకాలం కావడంతో వాతావరణంలో మార్పులతో సీజనల్ వ్యాధులు విజృంభిస్తాయి. వీధుల్లో ఉండే మురుగునీరు, పేరుకుపోయిన చెత్తాచెదారాలు, కలుషిత తాగునీటి కారణంగా వ్యాధులు సోకి ప్రమాదకరంగా మారే అవకాశాలున్నాయి. ముఖ్యంగా వీధి కాలువల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాలవల్ల, ఆరుబయట పడేస్తున్న చెత్తల వల్ల దోమలు ముసిరి ప్రజలు వ్యాధుల బారిన పడే ఆస్కారమంది. వ్యాధుల బారిన పడితే వైద్యుల సలహా తప్పనిసరిగా తీసుకుని అవసరమైన చికిత్స చేయించుకోవాలి.

వ్యాధులు పెరిగే పరిస్థితి

వర్షాకాలంలో చిరు జల్లులతో కూడిన వర్షాలు, మోస్తరు వర్షాలు కురుస్తుంటాయి. వర్షపునీరు ఇళ్ల చుట్టూ, అక్కడక్కడ నిలిచి దోమలకు ఆవాసాలుగా



పలగర చర్చి వద్ద లీకవుతున్న పైప్‌లైన్

మారుతుంటాయి. ఫలితంగా గ్రామాల్లో ప్రజలు జలుబు, జ్వరాల బారిన పడుతున్నారు. విస్తారంగా వర్షాలు కురిస్తే జలుబు, జ్వరం, దగ్గుతో పాటు మలేరియా, టైఫాయిడ్, చికెన్‌గున్యా, డెంగీ వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. వాటికి సంబంధించిన లక్షణాలు కనిపిస్తే సమీపంలో ఉన్న వైద్యశాలను సంప్రదించాలి. ముఖ్యంగా ఈ సీజన్‌లో చిన్నారులు, గర్భిణులు, వృద్ధులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు:

- ఆహారం, నీరు కలుషితం కాకుండా చూసుకోవాలి. మల, మూత్ర విసర్జన అనంతరం చేతులు శుభ్రం చేసుకోవాలి
- ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలి
- చిన్న పిల్లలకు వంటి నిండా దుస్తులు కప్పి ఉంచేలా చర్యలు తీసుకోవాలి
- పండ్లు, కూరగాయలను శుభ్రంగా కడిగిన తర్వాత తినాలి
- ఇంటి పరిసరాల్లో పాత టైర్లు, డ్రమ్ములు, వినియోగించిన కొబ్బరి బొండాలు ఉంచకూడదు
- నిల్వ ఉన్న నీటిని బయట పారపోయాలి
- కలుషిత నీటిని తాగకూడదు
- పేడదిబ్బలు గ్రామ సమీపంలో లేకుండా చూడాలి
- వేడిచేసి చల్లార్చిన నీటిని తీసుకోవాలి
- రాత్రి పూట నిద్రించే సమయంలో దోమ తెరలు వినియోగించాలి
- చెత్తాచెదారాలు పేరుకుపోకుండా చూసుకోవాలి

ప్రజలు జాగ్రత్తగా ఉండాలి

సీజనల్ వ్యాధులు సోకకుండా ప్రజలు జాగ్రత్తగా ఉండాలి. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడం, వేడినీటిని తాగడం, వానలో తడవకుండా ఉండాలి. అనుకోని పరిస్థితుల్లో వ్యాధులు సోకితే వెంటనే వైద్యాధికారిని సంప్రదించి తగిన చికిత్స చేయించుకోవాలి.

– మాధురి, వైద్యాధికారిణి, బలిజిపేట పీహెచ్‌సీ

యూరియా కోసం రైతుల ఆందోళన



రైతుసేవా కేంద్రం వద్ద ఆందోళన చేస్తున్న రైతులు

- అధికారుల చొరవతో పంపిణీ

సీతానగరం:

మండలంలోని వరిచేలకు వేయడానికి యూరియా లేక రైతులు వారం రోజులుగా అవస్థలు పడుతున్న సమయంలో సోమవారం మండలానికి ఎరువులు వచ్చాయని తెలియడంతో యూరియా పంపిణీ చేయాలని కోరుతూ పెద భోగిలి రైతు సేవా కేంద్రం ఎదుట రైతులు ఒక్కసారిగా ఆందోళన చేశారు. పొలాల్లో పంటలకు అవసరమైన ఎరువుల పంపిణీకి ముందుచూపు లేక పోవడంతో వరిచేలకు రెండవ పర్యాయం ఎరువులు లేక ఇతరప్రాంతాల్లో అధికధరలకు కొనుగోలు చేసి ఎరువులు వేస్తున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. మండలానికియూరియా వచ్చినప్పటికీ ఎరువుల కోసం పడుతున్న ఇబ్బందులపై ఎదుర్కొన్న గత అనుభవాల్ని దృష్టిలో ఉంచుకుని ఒక్కసారిగా పీఏసీఎస్, రైతు సేవా కేంద్రాలవద్ద రైతులు గుమికూడి ఎరువులు పంపిణీ చేసినంతవరకూ ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో తహసీల్దార్ బి.ప్రసన్నకుమార్ ఆధ్వర్యంలో ఏఓ ఎస్. అవినాష్, స్థానిక పోలీసుల సహకారంతో యూరియా పంపిణీ చేపడతామని సర్దిచెప్పడంతో రైతులు ఆందోళన విరమించారు. అనంతరం తహసీల్దార్ బి.ప్రస్నకుమార్, ఏఓ ఎస్.అవినాష్‌లు పోలీసుల సహకారంతో రైతులకు యూరియా పంపిణీ చేశారు.

ఎరువుకోసం బారులు తీరిన రైతులు

సాలూరు రూరల్: ఒక వైపు ముమ్మరంగా పొలం పనులు మరోవైపు ఎరువుకోసం పరుగులు ఇదీ మండలంలోని రైతుల దుస్థితి. గత ప్రభుత్వంలో ముందుగానే ప్రతి సచివాలయం పరిధిలో రైతులకు కావాల్సిన ఎరువులను ఇండెంట్ పెట్టి పంట సమయానికి అందించే విధంగా చర్యలు తీసుకుని రైతులకు అండగా ఉన్న విషయం తెలిసిందే. అయితే కూటమి ప్రభుత్వం ఇప్పుడు రైతులకు సకాలంలో సరిపడా ఎరువులు అందించలేక అష్టకష్టాలు పడుతోంది. చివరకు వచ్చిన అరకొర ఎరువుల పంపిణీ కోసం రైతులను కంట్రోల్ చేయలేక పోలీసులు ఆధ్వర్యంలో పంపిణీ చేయాల్సిన పరిస్థితి నెలకొంది. మండలంలోని బోరబంద సచివాలయం పరిధిలో సోమవారం



పోలీసుల సమక్షంలో యూరియా పంపిణీ చేస్తున్న పీఏసీఎస్, వ్యవసాయ సిబ్బంది

యూరియా పంపిణీలో పోలీసులు జోక్యం చేసుకోవాల్సిన పరిస్థితి ఎదురైంది. రైతులకు సరిపడా యూరియా అందుబాటులో లేకపోవడంతో సచివాలయం సిబ్బంది రైతులను కంట్రోల్ చేయలేమని ముందస్తుగా పోలీసులకు సమాచారం ఇవ్వగా కానిస్టేబుల్స్ చేరుకుని రైతులకు టోకెన్లు పంపిణీ చేసే ప్రయత్నం చేశారు. వచ్చిన యూరియా స్టాక్ 267 బస్తాలు మాత్రమే ఉండడంతో టోకెన్ల పంపిణీ కోసం ఎస్సై నరసింహమూర్తి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ఒకేసారి వర్షంలో రైతులు వందల సంఖ్యలో రావడంతో సచివాలయం సిబ్బంది తలుపులు వేసి రైతులను వర్షంలో నిలబెట్టి కిటికీల ద్వారా టోకెన్లు పంపిణీ చేశారు. టోకెన్లు అందని రైతులకు పోలీసులు నచ్చచెప్పి ఇళ్లకు పంపించారు.



టోకెన్ల కోసం సచివాలయం కిటికీల వద్ద క్యూలో రైతులు

బడిదేవరకొండ మైనింగ్‌పై తనిఖీలు నిర్వహించాలి

పార్వతీపురం రూరల్: మండల పరిధిలో ములగ, వెలగవలస సమీపంలోఉన్న బడిదేవరమ్మ కొండపై జరుగుతున్న మైనింగ్ తవ్వకాలకు సంబంధించి తనిఖీలు నిర్వహించాలని కాంగ్రెస్‌పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం జాయింట్ కలెక్టర్ శోభికకు కలెక్టరేట్‌లో వినతిపత్రాన్ని అందజేశారు. కొండపై మైనింగ్ తవ్వకాల వల్ల బడిదేవరమ్మ భక్తులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారని, అలాగే సమీపంలో చెరువులు, జీడితోటలు, పంటపొలాలు నాశనం అవుతున్నాయని వివరించారు. ఈ మేరకు సమీప గ్రామాల గిరిజనులు తీవ్రస్థాయిలో ఆందోళన చెందుతున్నట్లు తెలిపారు.

ములగ మీదుగా బస్సు నడపాలి

పార్వతీపురం నుంచి వెంకంపేట, చినబొండపల్లి, ఎమ్మార్‌నగరం మీదుగా మడకవానివలస, గంగాపురం, కోరి, కవిటిభద్ర, ములగ జంక్షన్ మీదుగా నడిమి ములగ తేలునాయుడువలస, డోకిశీల, గోచెక్క, టొంకి, డీకెపట్నం మీదుగా ఎర్రసామంతవలస వరకు ఆర్టీసీ బస్సు నడపాలని కోరుతూ కాంగ్రెస్ నాయకులు మరో వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు వంగల దాలినాయుడు, గౌరీశంకరరావు, శ్రీహరి, కోలాకిరణ్ తదితరులున్నారు.



బడిదేవర కొండ మైనింగ్ తవ్వకాలపై తనిఖీలు నిర్వహించాలని వినతిపత్రాన్ని చూపిస్తున్న కాంగ్రెస్ నాయకులు

రూ.లక్షా 30 వేల జరిమానా విధింపు

సాలూరు: పట్టణ స్టేషన్ పరిధిలో మద్యం తాగి వాహనాలు నడిపిన వాహనదారులకు లక్షా 30 వేల రుపాయల జరిమానాను జ్యూడిషియల్ మెజిస్ట్రేట్ విధించారని సీఐ అప్పలనాయుడు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన మాట్లాడుతూ స్టేషన్ పరిధిలో మద్యం తాగి వాహనాలు నడిపిన 13 మందిని మెజిస్ట్రేట్ ముందు హాజరుపరచగా ఒక్కొక్కరికీ రూ.పదివేలు జరిమానాను కోర్టు విధించిందని చెప్పారు.

గుండెపోటుతో ఎంపీడీఓ డ్రైవర్ మృతి

పార్వతీపురం రూరల్: మండల పరిషత్ అధికారివద్ద డ్రైవర్‌గా పనిచేస్తున్న గొర్లి ఉదయ్ కుమార్ (45) గుండెపోటు రావడంతో చికిత్స పొందుతూ మృతిచెందాడు. పార్వతీపురం పట్టణంలోని బెలగాంకు చెందిన ఉదయ్ కుమార్ సోమవారం ఉదయం తన ఇంట్లో అపస్మారక స్థితిలోకి వెళ్లిపోవడంతో గమనించిన కుటుంబ సభ్యులు కేంద్రాస్పత్రికి తరలించారు. ఈ మేరకు వైద్యులు చికిత్సను అందిస్తుండగా మృతిచెందాడు. ఉదయ్ కుమార్‌కు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఇటీవల కుమార్తెకు వివాహం నిశ్చయమై వచ్చే నెల సెప్టెంబర్ 27న వివాహం జరిపేందుకు నిర్ణయించుకోగా ఇంతలో ఉదయ్ కుమార్ మృతిచెందడంతో కుటుంబసభ్యుల్లో మరింత విషాదం నెలకొంది.

ఎస్‌డీసీ కార్యాలయానికి సొంత భవనం నిర్మించాలి

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని ఎల్విన్‌పేట దగ్గరున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్(ఎస్‌డీసీ) కార్యాలయం భవనానికి సొంత భవనం నిర్మించాలని ట్రైబల్ రైట్స్ ఫోరం జిల్లా అధ్యక్షుడు ఇంటికుప్పల రామకృష్ణ, రాష్ట్ర అధ్యక్షుడు రొబ్బా లోవరాజులు డిమాండ్ చేశారు. ఇదే విషయమై వారు సోమవారం విలేకరులతో మాట్లాడారు. గిరిజన ప్రాంతానికి ఎంతో ముఖ్యమైన ఎస్‌డీసీ కార్యాలయానికి సొంత భవనం లేనందున యూత్ ట్రైనింగ్ సెంటర్‌లోని ఓ గదిలో ఎస్‌డీసీ కార్యాలయం నిర్వహించాల్సి వస్తోందన్నారు. దీంతో అధికారులు వారికి సమస్యలు విన్నవించుకునేందుకు వస్తున్న వారు స్థలం కొరత కారణంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే పాత భవనం మరమ్మతులు చేపట్టడం గానీ సొంత భవనం నిర్మించడం గానీ చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఈ- క్రాప్‌తో బహుళ ప్రయోజనాలు



ఉల్లిభద్రలో ఈ-క్రాప్ నమోదు చేస్తున్న సిబ్బంది

- కొనసాగుతున్న నమోదు ప్రక్రియ
- సెప్టెంబర్ 15 వరకూ గడువు

పార్వతీపురం: ఆరుగాలం శ్రమించి పంటలు పండించే రైతులకు ఈ–క్రాప్‌తో అనేక ప్రయోజనాలు కలుగుతాయి. పంటల వివరాలను నమోదు చేసుకోవడం ద్వారా వారికి ప్రభుత్వం నుంచి అన్ని రకాల లబ్ధి చేకూరే అవకాశం ఉంది. పంటలు సాగు చేసినప్పటి నుంచి చేతికి వచ్చేంత వరకు, ప్రకృతి వైపరీత్యాలు సంభవించి సాగు చేసిన పంటలకు నష్టం జరిగితే నష్టపరిహారం పొందాలన్నా ఈ పంట నమోదు అవసరం అవుతుంది. అనుకూల వర్షాలు కురిసి పంట అధిక దిగుబడి వచ్చినా ప్రభుత్వ మద్దతు ధరతో విక్రయించుకునేందుకు ఈ-క్రాప్ ఎంతో కీలకం. విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ పనిముట్లు రాయితీపై పొందేందుకూ ఇదే ఆధారం. ఈ పంట నమోదుతో రైతులకు కలిగే ఉపయోగాలను గ్రామాల్లో రైతు సేవా కేంద్రం సిబ్బంది వివరిస్తున్నారు. సెప్టెంబర్ 15లోగా ఈ-క్రాప్ నమోదు చేసుకోవాలని వ్యవసాయసిబ్బంది సూచిస్తున్నారు.

1.75 లక్షల ఎకరాల్లో సాగు

జిల్లాలోని 966 గ్రామాలలో ఈ ఖరీఫ్‌కు 1.75 లక్షల ఎకరాలలో వరి ఇతర పంటలను సాగుచేస్తున్నారు. ఖరీఫ్ సీజన్‌లో సాగుచేసే వ్యవసాయ, ఉద్యాన పంటల సాగు వివరాలను శాఖల వారీగా ఆన్‌లైన్ చేసే ప్రక్రియ(ఈ-క్రాప్)ను ప్రారంభించారు. పంట సాగుహక్కు పత్రాలు పొందిన రైతులకు కూడా అవకాశం కల్పించారు. కాగా జిల్లాలో ఇంతవరకు 87వేల ఎకరాలవరకు ఈ -క్రాప్ నమోదు చేసినట్లు అధికారులు పేర్కొంటున్నారు.

పంటల వివరాలు నమోదుచేయించుకోవాలి



రైతులు తాము సాగుచేసిన పంటల వివరాలను ఈ-క్రాప్‌లో నమోదు చేయించుకోవాలి. ప్రకృతి వైపరీత్యాలవల్ల పంటలకు నష్టం జరిగితే పరిహారం పొందేందుకు అవకాశం ఉంటుంది. ఇప్పటికే రైతు సేవా కేంద్రాల పరిధిలో సిబ్బంది ఈ-క్రాప్ నమోదు చేస్తున్నారు.

– కె.రాబర్ట్‌పాల్, జిల్లా వ్యవసాయాధికారి, పార్వతీపురం మన్యం

కదం తొక్కిన కమ్యూనిటీ వర్కర్లు



జోరువానలో గొడుగులు వేసుకుని నిరసన వ్యక్తం చేస్తున్న కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు

పార్వతీపురం రూరల్: కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో సీఐటీయూ ఆధ్వర్యంలో కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు తమ సమస్యల పరిష్కారంపై నిరసన వ్యక్తం చేశారు. జిల్లాలో మారుమూల గిరిజన ప్రాంతాల్లో సేవలు అందించడానికి జిల్లాలో ఉన్న రెండు పార్వతీపురం, సీతంపేట పరిధిలతో కలిపి జిల్లా వ్యాప్తంగా మొత్తం 1565 మంది కమ్యూనిటీ హెల్త్‌వర్కర్లు సేవలందిస్తుండగా, తాముకూడా ఆశవర్కర్లతో సమానంగా విధులు నిర్వహిస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం రూ.4వేలు వేతనం ఇవ్వడం దారుణమని, పెరుగుతున్న నిత్యావసర ధరలు, కుటుంబాల అవసరాలను దృష్టిలోపెట్టుకుని వేతనాలు పెంచాలని, అలాగే ఇచ్చిన ఆ అరకొర వేతనాన్ని కూడా సక్రమంగా ఇవ్వడం లేదని నాలుగు నెలల బకాయిలను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే సీహెచ్ డబ్ల్యూలను ఆశలుగా మార్పు చేయాలని, మరో ఐదు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు.

నేటితో ముగియనున్న ప్రవేశాల గడువు

పాలకొండ రూరల్:

డిగ్రీ ప్రవేశాలకు సంబంధించి రిజిస్ట్రేషన్ల ప్రక్రియ మంగళవారంతో ముగియనుందని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్స్‌పాల్ డాక్టర్ మానుకొండ శ్యాంబాబు అన్నారు. తమ కళాశాలలో జరుగుతున్న రిజిస్ట్రేషన్ల ఆన్‌లైన్ ప్రక్రియను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బీఏ ఎకానమిక్స్, పొలిటికల్ సైన్స్, బీకామ్ కంప్యూటర్ అప్లికేషన్స్, జనరల్, బీఎస్సీ కెమిస్ట్రీ, కంప్యూటర్స్ సైన్స్, బీఎస్సీ జువాలజీ కోర్సుల్లో చేరదలచి విద్యార్థులు గడువు ముగియక ముందే నిర్దేశిత ధ్రువపత్రాలతో కళాశాలకు రావాలన్నారు.



అధ్యాపకుల ఆధ్వర్యంలో జరుగుతున్న రిజిస్ట్రేషన్ ప్రక్రియ

బదిలీ ఉపాధ్యాయులను రిలీవ్ చేయాలి

- ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటరావు

వీరఘట్టం: ఇటీవల బదిలీ అయినా కొత్త పాఠశాలల్లో చేరని ఉపాధ్యాయులను విద్యాశాఖ అధికారులు వెంటనే రిలీవ్ చేయాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అన్ను వెంకటరావు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో సోమవారం ఆయన మాట్లాడుతూ.. బదిలీ అయిన వారిని రిలీవ్ చేసి ఆయా స్థానాల్లో డీఎస్సీ- 2005 అభ్యర్థులను నియమించాలని కోరారు. అలాగే 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పింఛన్ విధానం అమలు చేయడంతో పాటు డీఏలు, సరెండర్ లీవ్‌ల బకాయిలు చెల్లించాలన్నారు. సమావేశంలో ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘ నాయకులు అంపోలు సూర్యనారాయణ, గునాన దుర్గాప్రసాద్, అన్ను ప్రసాద్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్సీ,ఎస్టీ ఉపాధ్యాయ సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటరావు

ప్రమాదకరంగా మలుపులు



మక్కువ, దుగ్గేరు రహదారి మధ్యలో ప్రమాదకరమైన మలుపు

మక్కువ: మండలంలోని పలు గ్రామాల రహదారుల వద్ద మలుపులు ప్రమాదాలకు పిలుపుగా మారాయి. మక్కువ నుంచి గ్రామానికి వెళ్లే మార్గంలో బొడ్డుసామంతవలస, ఎర్రసామంతవలస, పనసభద్ర గ్రామాల వద్ద మలుపులు ప్రమాదకరంగా తయారయ్యాయి. మలుపుల వద్ద తుప్పలు ఏపుగా పెరగడంతో, ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక వాహనదారులు ఆందోళనచెందుతున్నారు. అలాగే మక్కువ, చినబోగిలి గ్రామాల మధ్య కంచేడువలస గ్రామం వద్ద, మక్కువ, బొబ్బిలి మధ్య కన్నంపేట గ్రామం మలుపు వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. మలుపుల వద్ద కనీసం స్పీడ్‌బ్రేకర్లు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి మలుపుల వద్ద ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

గజానికో గొయ్యి

మక్కువ మండలకేంద్రం మక్కువ నుంచి, సాలూరు పట్టణానికి వెళ్లే రహదారి దుస్థితి ఈ ఫొటోలు చూస్తే స్పష్టంగా అర్థమవుతుంది. మక్కువ నుంచి, సాలూరు మండలం బాగువలస గ్రామం వరకు రహదారి మొత్తం గజానికో గొయ్యి ఏర్పడంది. సోమవారం ఉదయం నుంచి, సాయంత్రం వరకు ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి గోతుల్లో నీరు చేరడంతో, వాహనదారులు ఏవిధంగా ప్రయాణించాలో అర్థం కాక అనేక అవస్థలు పడుతున్నారు. ముఖ్యంగా మండలకేంద్రం మక్కువ సమీపంలోని మేళాపువలస కాలనీ నుంచి మజ్జిగైరమ్మ ఆలయం వరకు రహదారి మరీ అధ్వానంగా తయారైంది.



మక్కువ, సాలూరు రోడ్డు దుస్థితి